క్లుప్తంగా

పీహెచ్‌సీ, పల్లె దవాఖానాల్లో తనిఖీ


వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

ముదిగొండ: ముదిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎన్‌సీడీ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ రామారావు, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వెంకటరమణ గురువారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా పీహెచ్‌సీలోని ల్యాబ్, ఫార్మసీ, వ్యాక్సిన్ గదులతో పాటు రికార్డులను పరిశీలించారు. అనంతరం మాధాపురంలోని పల్లెదవాఖానాను సైతం తనిఖీ చేశారు. వైద్యాధికారి అరుణాదేవి, ఉద్యోగులు పాల్గొన్నారు.

కల్లూరు పరిధిలోకి చంద్రుపట్ల పీహెచ్‌సీ

కల్లూరురూరల్: కల్లూరు మండలం చంద్రుపట్ల పీహెచ్‌సీని చెన్నూరు ఆస్పత్రి పరిధి నుంచి తొలగించి కల్లూరు ఏరియా ఆస్పత్రిలోకి మార్చాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. గురువారం ఆయన చంద్రుపట్లకు రాగా గ్రామస్తులు ఆస్పత్రి పరిధిపై విన్నవించారు. దీంతో ఆయన డీఎంహెచ్‌ఓకు మాలతికి ఫోన్ చేసి పీహెచ్‌సీని కల్లూరు ఏరియా ఆస్పత్రి పరిధిలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఆతర్వాత మాజీ సర్పంచ్ వల్లభనేని భద్రయ్య, వివిధ పార్టీల నాయకులు భద్రయ్య, కట్టా పుల్లయ్యతో పాటు సాయిని అప్పారావు కుటుంబీకులను మంత్రి పరామర్శించారు. నాయకులు పసుమర్తి చందర్‌రావు, లక్కినేని కృష్ణ, ఏనుగు సత్యంబాబు, పోటు సత్యం, దిరిశాల నర్సింహారావు పాల్గొన్నారు.

హిందూ శ్మశాన వాటిక సర్వే

మధిర: ఆక్రమణకు గురైన మధిర హిందూ శ్మశాన వాటిక స్థలాన్ని గురువారం జిల్లా సర్వేయర్ వెంకట్రావు ఆధ్వర్యంలో సర్వే చేసి హద్దులు నిర్ణయించారు. 424 సర్వే నంబర్‌లో హిందూ శ్మశాన వాటికకు చెందిన 10.04 ఎకరాల భూమి ఉంది. ఈ భూమి ఆక్రమణకు గురైనట్లు ఫిర్యాదులు రావడంతో ఖమ్మం ఆర్డీఓ నరసింహారావు ఆదేశాల మేరకు వెంకట్రావు ఆధ్వర్యంలో సిబ్బంది సర్వే చేశారు. హిందూ శ్మశాన వాటిక స్థలానికి సరిహద్దులో ఉన్న గృహ యజమానులకు రెవెన్యూ అధికారులు ముందుగానే నోటీసులు జారీ చేశారు. వారు తమ వద్ద ఉన్న స్థల ధ్రువీకరణ పత్రాలను తీసుకొని వచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాళ్లబండి రాంబాబు, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, మండల సర్వేయర్ ఉషారాణి, కౌన్సిలర్లు మల్లాది వాసు, వెంకటేశ్వర్లు, సీపీఐ నాయకులు బెజవాడ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చూడాలి


ఇంటింటి సర్వేలో రైతు సంఘం బాధ్యులు

వైరారూరల్: రాష్ట్రంలో యూరియా కొరత లేకుండా చూడాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని పూసలపాడు గ్రామంలో రైతు సమస్యల మీద ఇంటింటి సర్వే నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. యాసంగి సీజన్‌లో రైతులకు కావాల్సిన ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచాలని కోరారు. ప్రభుత్వ పర్యవేక్షణ లేనందున సొసైటీల్లో గడ్డలు కట్టిన యూరియాను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. బాణాల శ్రీనివాసరావు, తోట నాగేశ్వరరావు, ద్రోణాదుల నాగేశ్వరరావు తదితరులున్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు..

ముదిగొండ: మద్యం సేవించి వాహనాలు నడపొద్దని ఎస్సై అనంతరాములు అన్నారు. జాతీయ రోడ్డుభద్రతా వారోత్సవాలు సందర్భంగా గురువారం ముదిగొండలో వాహనదారులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ద్విచక్రవాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెంట్ ధరించి, రోడ్డు భద్రతా నియమాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్‌లు అబ్దుల్‌ఖలీఖ్, సూర్యనారాయణ, కానిస్టేబుళ్ల రాజు, గోపి, చిన్నా, లక్ష్మణ్‌నాయక్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

కారేపల్లి: సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బుధవారం బహుమతులు అందించారు. మొదటి బహుమతి గుగులోత్ కీర్తి, ద్వితీయ బహుమతి భూక్యా శ్రీనిధి, తృతీయ బహుమతి అజ్మీర సంజన లకు.. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ వారి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కల్యాణ్, రాంబాబు, నాగేష్, మహేష్, రవి, అశోక్, గాంధీ, రమేష్, శివ పాల్గొన్నారు.

పూత రాలిపోతోంది..

- మామిడి పూతకు తెగుళ్ల బెడద..
- అదుపులోకి రాని తేనె మంచు పురుగు
- ఆందోళన చెందుతున్న రైతులు


మామిడి తోటకు క్రిమి సంహారక మందులు పిచికారీ చేస్తున్న రైతు

కల్లూరురూరల్: మామిడి పంటకు ఈ ఏడాది వాతావరణం అనుకూలంగా ఉండటంతో మామిడి చెట్లకు పూర్తి స్థాయిలో పూత వచ్చింది. ఈ ఆనందం రైతులకు లేకుండానే.. తెగుళ్ల బెడద వల్ల మామిడి పూత, పిందె ఏర్పడకుండానే పూత నల్లగా మాడిపోయి పడిపోతుంది. ముఖ్యంగా తేనె మంచు పురుగ వల్ల మామిడి పూతను విపరీతమైన నష్టం ఏర్పడుతోంది. ఇప్పటికే మామిడి రైతులకు కొంత మంది మూడుసార్లు, నాలుగు సార్లు క్రిమి సంహారక మందులు పిచికారీ చేసినప్పటికీ తెగుళ్ల బెడద అదుపులోకి రాలేదు. ఇప్పటికే రైతులు సస్యరక్షణ కోసం వేలాది రూపాయలు ఖర్చు చేశారు. అయినప్పటికీ ఫలితం కనిపించకపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. మామిడిపూతపై తేనెమంచు పురుగుతో పాటు, రసం పీల్చే పురుగు ఆశిస్తుంది. ఖరీదైన క్రిమి సంహారక మందులు కూడా పని చేయకపోవటంతో ఏమి చేయాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. మామిడి చెట్లకు పూర్తి స్థాయిలో పూత ఏర్పడి పిందెలు ఏర్పడకుండానే రాలిపోతుండడంతో రైతుల్లో ఆందోళణ మొదలైంది.

కల్లూరు డివిజన్ పరిధిలోని 12,300 ఎకరాల్లో..

కల్లూరు డివిజన్ పరిధిలో సుమారు 12,300 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. కల్లూరు మండలంలో 2,400 ఎకరాలు, వేంసూరు మండలంలో 3వేల ఎకరాలు, సత్తుపల్లి మండలంలో 1,200 ఎకరాలు, పెనుబల్లి మండలంలో 3,200 ఎకరాలు, తల్లాడ మండలంలో 14 వందల ఎకరాలు, ఎన్కూరు మండలంలో 1,100 ఎకరాల్లో మామిడి తోటలు సాగులో ఉన్నాయి. ఈ ప్రాంత మామిడి నాణ్యత కలిగి ఉండి మార్కెట్లో మంచి ధర పలుకుతోంది. ఏడాది వైరస్, తేనె మంచు పురుగు, చీడ పీడలు ఆశించటంతో ఎకరం మామిడి తోటకు ఇప్పటికే సుమారు 20వేల రూపాయల క్రిమి సంహారక మందులు పిచికారీ చేశారు. అయినప్పటికీ ఫలితం అంతంత మాత్రమే ఉంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

ఒక పూ కొమ్మలో సుమారు రెండువేల నుంచి మూడువేల పుష్పాలు ఉంటాయి. ఈ పూతలో సుమారు 99శాతం రాలిపోతుంది. ఒక పూరెమ్మకు ఐదు నుంచి ఆరు పిందెలు కడతాయి. ఈ ఐదు నుంచి ఆరు పిల్లల్లో చివరికి ఒకటి లేక రెండు పెద్ద పిందెలు మాత్రమే ఎదిగి కాయలుగా మారతాయి. మామిడితో పూతరాలడం సహజం. మగ పుష్పాలు ఫలదీకరణం చెందని పుష్పాలు రాలిపోతుంటాయి. అధిక ఉష్ణోగ్రత, బూడిద తెగులు, తేనె మంచు పురుగు, నీటి ఎద్దడి అధిక తేమ లోపం వల్ల పూత, పిందె రాలుతుంది.

- పూతకు ముందు పుష్పగుచ్ఛాలు సాగే సమయంలో, పూత విచ్చుకున్న సమయంలో బోరాక్స్ రెండు గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయడం ద్వారా పిందె కట్టడం పెంచవచ్చు. తెల్లపూత ముగిసే దశలో ఒకసారి తేలికపాటి తడి ఇవ్వడం ద్వారా పిందె కట్టడం పెంచే అవకాశం ఉంది.
- పూత చుట్టు పురుగు పూతను కూడుగా ఏర్పరచుకొని పూతను తిని విపరీతంగా నష్టపరుస్తుంది. ఇది ఆశించిన పూత గుత్తుల్లో పిందెలు ఏర్పడవు. ఈ పురుగు నివారణకు క్లోరిపైరీఫాస్ 2.5 ఎంఎల్ నీటికి కలిపి పూల గుత్తులపై పిచికారీ చేయాలి. పూత దశలో బూడిద తెగులు కనిపిస్తే లీటర్ నీటికి ఎక్సాకోణజోల్-2 ఎంఎల్ లేదా ట్రోఫీకోనజోల్ ఒక ఎంఎల్ లేదా డోనోకాఫ్ ఒక ఎంఎల్ చొప్పున కలిపి భూతకాడలు తడిచేలా పిచికారీ చేయాలి. పూత మాడు తెగులు నివారణకు మొగ్గ బయటకు వచ్చే దశలో మూడు గ్రాముల కాఫర్ కార్బికోరేడ్ పచ్చిపూత మీద ఒక గ్రాము దైవఫినైట్స్ విధేయలు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

పెట్టుబడి అధికమవుతోంది..



ఈ ఏడాది మామిడి సాగుకు ఖర్చు ఎక్కువ అవుతుంది. పూత దశలోనే వైరస్‌లు, తేనె మంచు పురుగు, బూడిద తెగులు ఆశిస్తోంది. దీని నివారణకు ఖరీదైన మందులు పిచికారీ చేయాల్సి వస్తుంది. మామిడి దిగుబడి ఎలా ఉంటుందో ఏమోకానీ ఇప్పుడు మాత్రం పెట్టుబడి చాలా అవుతుంది.

– వైకంటి శ్రీనివాసరావు, మామిడి రైతు, ముచ్చవరం

జాడలేని అధికారులు..



ఈ సంవత్సరం మామిడి పంటకు విపరీతంగా వైరస్‌లు సోకుతున్నాయి. సంబంధిత ఉద్యానవన అధికారుల సలహాలు, సూచనలు మామిడి రైతులకు అందటం లేదు. ఇష్టం వచ్చిన రీతిలో మందుల వాడి ఆర్థికంగా నష్టపోతున్నాం. ప్రభుత్వం వెంటనే కల్లూరు డివిజన్ ఉద్యానవన శాఖ అధికారులను నియమించి రైతులకు సలహాలు ఇవ్వాలి.

– పెద్దబోయిన నారాయణరావు, మామిడి రైతు, పుల్లయ్యబంజరు

విద్యుత్ శాఖ పొలంబాట


అవగాహన కల్పిస్తున్న ఏఈ అనూష

ఎర్రుపాలెం: మండలంలోని రేమిడిచర్ల గ్రామంలో గురువారం విద్యుత్ శాఖ అధికారులు పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఏఈ జి.అనూష మాట్లాడుతూ.. రైతులు తమ పంట పొలాలకు సాగునీరు పెట్టుకునే సమయంలో ఎటువంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విద్యుత్ మోటార్లకు రైతాంగం విధిగా కెపాసిటర్లు అమర్చుకోవాలని సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్లు ఓవర్ లోడ్‌తో కాలిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఫోర్‌మేన్ రత్నాకర్, లైన్‌మేన్ నారాయణరెడ్డి, జూనియర్ లైన్‌మెన్ వంశీకృష్ణ, ఏఎల్ఎం కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మెడిసిన్ విద్యార్థికి చేయూత


వసీముద్దీన్‌కు చెక్కు అందజేస్తున్న రామారావు

కల్లూరు: కల్లూరుకు చెందిన పంచాయితీ కార్మికుడు సయ్యద్ వజీర్‌మియా కుమారుడు వసీముద్దీన్ రామగుండం సింగరేణి మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. నిరుపేద కుటుంబం కావడంతో ఫీజులు, పుస్తకాలకు ఇబ్బంది పడుతుండగా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి వరకా రామారావు దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో ఆయన యూఎస్‌ఏకు చెందిన వినీత్ ద్వారా రూ.1.20 లక్షలు ఇప్పించగా గురువారం చెక్కు అందజేశారు.

వేంకటేశ్వరస్వామి ఆలయానికి వితరణ

సత్తుపల్లిరూరల్: పట్టణంలోని ద్వారకాపురి కాలనీలో గల శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి స్థానిక జేవీఆర్ ఓసీ ఆపరేటర్ టి.రాంబాబు, పద్మ దంపతులు గురువారం రూ.18,116లను ఆలయ నిర్వాహకులకు అందించారు. కార్యక్రమంలో మల్లికార్జునశర్మ, వెంకటేశ్వరరావు, చంద్రారెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.

పెయింటర్ల అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా సురేష్

కారేపల్లి: పెయింటర్స్ (ఐఎఫ్‌టీయూ అనుబంధ) సంఘం కారేపల్లి మండల నూతన అధ్యక్షుడిగా కారేపల్లికి చెందిన నక్క సురేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం కారేపల్లి సంతగుడి ప్రాంగణంలో మండల పెయింటర్స్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కె.సాయి, కార్యదర్శిగా జి.రవి, కోశాధికారిగా పానుగంటి సత్యం, సహాయ కార్యదర్శిగా వెంకటేష్, గౌరవ సలహాదారిగా జిట్టబోయిన కుమార్‌యాదవ్, గుర్రాల నరసింహారావు, ఆదెర్ల రామారావు, పాషా, కమిటీ సభ్యులుగా రమేష్, జానీ, ఖదీర్, మాలిక్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.


మిర్చి క్వింటాకు రూ.20వేలు చెల్లించాలి

బోనకల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిర్చి క్వింటాల్‌కు రూ.20 వేలను చెల్లించాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని లక్ష్మీపురంలో తెలంగాణ రైతుసంఘం బృందం మిర్చి తోటలను పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు రమేష్, నాగేశ్వరరావు, ఉమ, నరేష్ పాల్గొన్నారు.

మోహన్‌రావు సేవలు మరువలేనివి

తల్లాడ: మోహన్‌రావు సేవలు మరువలేనివి సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాచర్ల భారతి, మాదినేని రమేష్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని అంజనాపురంలో నిర్వహించిన పుసులూరి మోహన్‌రావు సంస్మరణ సభలో వారు పాల్గొని మాట్లాడారు. నమ్మిన సిద్ధాంతం కోసం తన తుదిశ్వాస విడిచే వరకు కమ్యూనిస్టుగా ఉంటూ సీపీఎం అభివృద్ధికి కృషి చేశారన్నారు. ఈ సభలో సీపీఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి, తాతా బాస్కర్‌రావు, మండల కార్యదర్శి రామలింగేశ్వర్‌రావు, కృష్ణయ్య, మోహన్‌రావు, కృష్ణయ్య, ప్రభాకర్‌రావు, విద్యాసాగర్, చలపతిరావు, ప్రకాశరావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


అలనాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

సత్తుపల్లిరూరల్: మండలంలోని కిష్టారం జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2000 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు గురువారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఇరవై ఐదేళ్ల తర్వాత ఒకరినొకరు కలుసుకొని బాగోగులు తెలుసుకున్నారు. అలనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువలను సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధి, విద్యార్థులకై కొంత నగదును పాఠశాల నిర్వాహకులకు అందించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో సతీం, అనంతాచార్యులు, శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే


కలెక్టర్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరా: వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ గురువారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ తర్వాత నియోజకవర్గ అభివృద్ధి, వైరా మున్సిపాలిటీలో షాపింగ్ కాంప్లెక్స్‌లతో పాటు పెండింగ్ ఉన్న పలు రకాల అభివృద్ధి పనుల గురించి కలెక్టర్‌తో చర్చించారు.

క్యాలెండర్లు ఆవిష్కరణ


క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘం బాధ్యులు

మధిర: శ్రీ వాసవీ ఆర్యవైశ్య కల్యాణ మండపం ఆవరణలో మధిర మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభలో నూతన సంవత్సర క్యాలెండర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మధిర మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చారుగుండ్ల నరసింహమూర్తి, ప్రధాన కార్యదర్శి కాజా చక్రదర్ రావు, ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షులు లక్ష్మీనరసింహారావు, వేణుగోపాలరావు, మధిర మండలం ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ముదిగొండ: గ్రామపంచాయతీ కారోబార్‌అండ్ వర్కర్స్‌యూనియన్ క్యాలెండర్‌ను ముదిగొండలో ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, ఎంపీఓ వాల్మీకి కిషోర్‌లు గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది జాలా రామయ్య, నాగేశ్వరరావు, శ్రీహరి, మహేందర్, నాగరాజు, సైదులు, ప్రదీప్, శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్లు..

కారేపల్లి: ఈ నెల 18వ తేదీన గోదావరిగని పట్టణంలో జరిగే ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ.. గురువారం కారేపల్లిలో హమాలీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ అనుబంధ) ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బానోత్ రామ్‌సింగ్ మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పట్ల చిన్న చూపు చూస్తుందని, కార్మికుల సంక్షేమానికి ఎలాంటి చర్యలు చేపట్టకపోవటం విచారకరమన్నారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పోలూరి శ్రీనివాసరావు, మండల కార్యదర్శి భూక్యా శివనాయక్, హమాలీ సంఘం నాయకులు బిక్షం, లింగస్వామి, సైదులు, రాజు, రాములు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి


బోనకల్‌లో స్త్రీ టీస్టాల్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ సన్యాసయ్య

బోనకల్: మహిళలు ప్రభుత్వ చేయూతను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా ఎదగాలని డీఆర్‌డీఓ ఆర్.సన్యాసయ్య సూచించారు. ఇందిరా మహిళాశక్తి పథకంలో భాగంగా మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన స్త్రీ టీ స్టాల్‌ను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం ప్రతీ మండలంలో చిరు వ్యాపారులకు సబ్సిడీపై రుణాలు ఇచ్చి ప్రోత్సహిస్తోందని తెలిపారు. అనంతరం ఆయన ఐకేపీ కార్యాలయంలో బ్యాంక్ రుణాలు, రికవరీపై సీసీలతో సమీక్షించారు.

సభ్యత్వ నమోదు పూర్తి చేయాలి..

చింతకాని: ఇందిరా డెయిరీలో సభ్యత్వాల నమోదు త్వరగా పూర్తి చేయాలని డీఆర్‌డీఓ ఆర్.సన్యాసయ్య సెర్ప్ సిబ్బందిని ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో సెర్ప్, ఈజీఎస్ సిబ్బందితో సమావేశమైన ఆయన పలు అంశాలపై సమీక్షించి సూచనలు చేశారు. ఆతర్వాత జగన్నాధపురంలో ఇందిరా డెయిరీ మిల్క్ చిల్లింగ్ పాయింట్ పనులు, నాగులవంచలో స్త్రీ టీస్టాల్‌ను పరిశీలించారు. ఐకేపీ ఏపీఎం శ్రీనివాసరావు, ఈజీఎస్ ఏపీఓ కోటయ్య, డెయిరీ మేనేజర్ లక్ష్మణ్‌రావుతో పాటు మమత, విక్టోరియా పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరా: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాలుగు సంక్షేమ పథకాలు అమలులో ఎక్కడా రాజీ పడొద్దని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అన్ని మండలాల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజమైన లబ్ధిదారులందరికీ పథకాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఈ నెల 26నుంచి పూర్తి స్థాయిలో పథకాల అమలు జరుగుతుందన్నారు. ఈ సమావేశం వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, కాంగ్రెస్ నాయకులు, వివిధ మండలాల అధికారులు పాల్గొన్నారు.

సర్వే పారదర్శకంగా చేపట్టాలి


తల్లాడ: మల్లవరంలో సూచనలు చేస్తున్న కల్లూరు ఆర్డీఓ రాజేందర్ గౌడ్


సత్తుపల్లిలో సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

తల్లాడ: మండలంలో తల్లాడ, మల్లారం, గోపాలపేట, అన్నారుగూడెం గ్రామాల్లో జరుగుతున్న సర్వేను కల్లూరు ఆర్డీఓ రాజేందర్ గౌడ్ పరిశీలించి మాట్లాడారు. నూతనంగా తల్లాడ మండలానికి వచ్చిన 2000 కార్డులకు సంబంధించిన లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి విచారణ చేస్తున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వనజ, ఎంపీడీఓ చంద్రమౌళి, ఏఓ ఎండి.తాజుద్దీన్, ఎంపీఓ శ్రీదేవి, ఏపీఓ కోటయ్య, ఆర్ఐలు భాస్కర్, ఖాజామొయినుద్దీన్, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి మున్సిపాలిటీలో రేషన్ కార్డుల జారీ కోసం లబ్ధిదారుల ఎంపికకు గురువారం వార్డు ఆఫీసర్లు సర్వే చేపట్టారు. పట్టణంలోని 23 వార్డుల్లో.. ఇరవై మంది వార్డు ఆఫీసర్లు సర్వేలో నిమగ్నమయ్యారు. మొత్తం 808 దరఖాస్తులను ఇంటింటికి వెళ్లి వివరాలను సేకరిస్తున్నారు. కులగణన సర్వేలో రేషన్‌కార్డు లేనివారిని గుర్తించి అర్హులను ఎంపిక చేసేందుకు విచారణ చేపడుతున్నట్లు కమిషనర్ మందా రవిబాబు తెలిపారు.

కల్లూరురూరల్: కల్లూరు డివిజన్ పరిధిలోని వేంసూరు, కల్లూరు, సత్తుపల్లి, పెనుబల్లి, తల్లాడ, ఏన్కూరు మండలాల్లో నిర్వహిస్తున్న సర్వే స్పెషల్ ఆఫీసర్‌గా ఆర్డీఓ రాజేందర్‌గౌడ్‌కు ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. కల్లూరు మండలంలో నిర్వహిస్తున్న సర్వేను తహసీల్దార్ పులి సాంబశివుడు, ఎంపీడీఓ దాసరి చంద్రశేఖర్, డీటీ బాబ్జిప్రసాద్ ఇంటింటి కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు.

వేంసూరు: తెలంగాణ ప్రభుత్వం చేపట్టనున్న నాలుగు పథకల అమలు, అర్హులైన లబ్ధిదాల గుర్తింపుకు గురువారం నుంచి సర్వే ప్రారంభించగా.. రాయుడుపాలెంలో సర్వేను తహసీల్దార్ ఎంపరాజు,భభరణిపాడులో వ్యవసాయాధికారి రాంమోహన్ పరిశీలించారు.

రేషన్‌కార్డులు మంజూరు చేయాలి

బోనకల్: ప్రజాపాలన కార్యక్రమంలో రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డులు మంజూరు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నప్పటికీ కొంతమందికి సర్వేలో పేర్లు నమోదు కాలేదని కేవలం వారి తల్లిదండ్రుల రేషన్‌కార్డులలో పేర్లు తొలిగించుకున్న వారివే ఉన్నాయన్నారు. వివాహం చేసుకున్న దంపతులు పదేళ్లు దాటి పిల్లలు ఉన్నప్పటికీ రేషన్‌కార్డులేక ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిజమైన లబ్ధిదారులను గుర్తించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు ఆకెన పవన్, జక్కుల రామారావు తదితరులు పాల్గొన్నారు.

చదువు సమాజానికి వెలుగు

కారేపల్లి: చదువు సమాజానికి వెలుగు లాంటిదని, ఎన్ని ఆటంకాలు వచ్చిన మొక్కవోని దీక్షతో ప్రతి విద్యార్థి చదవాలని.. డాక్టరేట్ గుగులోత్ రవి అన్నారు. బుధవారం రాత్రి స్థానిక ప్రసన్నాంజనేయస్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు, సింగరేణి మండల ప్రెస్‌క్లబ్ సభ్యుడు.. డాక్టరేట్ సాధించిన గుగులోత్ రవిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో సృజనాత్మకత ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రాందాస్, ధర్మా, ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ చైర్మన్ దారావత్ కల్యాణ్, వైస్ చైర్మన్ నాగేష్, కోశాధికారి రాంబాబు, మహేష్, రవి, అశోక్, గాంధీ, నాగేష్, రమేష్, శివ పాల్గొన్నారు.

సాయినాథుడికి ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం: మండలంలోని భీమవరం, తక్కెళ్ళపాడు, ఎర్రుపాలెం గ్రామాల్లో కొలువైన శ్రీసాయిబాబా ఆలయాల్లో స్వామికి గురువారం ఆయా ఆలయాల అర్చకులు శాస్త్రోక్తంగా ప్రత్యే క పూజలు నిర్వహించారు. బాబా విగ్రహాలకు శాస్త్రోక్తంగా, సంప్రదాయబద్ధంగా, పంచామృతాలతో అభిషేక పూజలు చేశారు. శ్రీసాయిబాబాని భక్తులు దర్శించుకుని పూజలు జరుపుకున్నారు. అర్చకులు ప్రసాదాలు పంపిణీ చేశా రు. మండలకేంద్రంలోని ఆలయంలో భక్తులకు పలువురు దాతలు తల్లపురెడ్డి నాగిరెడ్డి, రామిశెట్టి శేషగిరిరావు, యరమల వెంకట్రావమ్మలు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కంచర్ల వెంకటస్వామి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ వైరు చోరీ

చింతకాని: మండలంలోని రామకృష్ణాపురంలో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కాపర్ వైరును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ ఘటనపై చింతకాని ఏఈ చావా శ్రీధర్ ఇచ్చిన ఫిర్యాదుతో గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

ఆత్కూరు సర్కిల్‌కు అబ్బూరి పేరు తొలగింపు


మాట్లాడుతున్న శ్రీధర్ రెడ్డి

మధిర: మండలంలోని ఆత్కూరు సర్కిల్‌లో గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన అబ్బూరి సర్కిల్ నేమ్ ప్లేట్‌ను గురువారం అధికారులు తొలగించారు. రోడ్లు భవనాల శాఖకు సంబంధించిన స్థలంలో ప్రైవేట్ వ్యక్తి పేరుతో సర్కిల్ ఏర్పాటు చేయడంపై అధికారులకు కొందరు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టి బోర్డు తొలగించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ శాఖ, రెవెన్యూ, పోలీస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

గ్రామస్తుల నిరసన..

మాజీ సర్పంచ్‌గా ఆత్కూరు గ్రామాభివృద్ధికి విశేషంగా కృషి చేసిన రామకృష్ణ పేరును సర్కిల్‌లో తొలగించినందుకు గురువారం గ్రామస్తులు పలువురు నిరసన తెలిపారు. అనంతరం ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన తెలిపారు. ఈ నిరసనకు బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ ఏలూరు నాగేశ్వరరావు సంఘీభావం తెలుపగా మాజీ సర్పంచ్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు. కాగా, నిరసనతో రాకపోకలకు ఆటంకం కలిగించిన అబ్బూరి సంధ్యారాణి, రామన్ సహా పలువురిపై కేసు నమోదు చేసినట్లు మధిర టౌన్ పోలీసులు తెలిపారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 9059115968
ఖమ్మం ఎన్. ఉపేందర్ - 99591 24151
పాలేరు ఎం. రామకృష్ణ - 85220 39990
వైరా ఐ. రాందాస్ - 98898 81843
సత్తుపల్లి జి. బాబు - 79979 58225
టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083
సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24
మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎస్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600
రవికుమార్ - 99499 27792
ఎస్. జయరాజు - 96528 68642